పోలీసులకు సన్మానం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్స్, పోలీసులు ఎనిమిది మందికి ఒకేసారి బదిలీ కావడంతో స్థానిక ఎస్సై రవీంద్ర ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు . ఒకేసారి 8 మందికి బదిలీ అయ్యింది.. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి ఎఫ్ ఎస్ ఐ, స్థానిక ఏ ఎస్ ఐ లు, సిబ్బంది, వివిధ పార్టీల నేతలు, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎస్ఐ

మన్యంలో పర్యాటకుల సందడి

చాపరాయి వద్ద పర్యాటకులు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకుల తాకిడితో చాపరాయి జలపాతం కిట కిటలాడింది. పర్యాటకులు చాపరాయి జలపాతంలో చిన్న పెద్ద తేడా లేకుండా సరదాగా జారుకుంటూ స్థానాలు చేస్తూ కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. గిరిజన సాంప్రదాయమైన థింసా నృత్యాన్ని ప్రదర్శిస్తూ ఆనందంగా గడిపారు. జలపాతంలో స్నానాలు చేసిన తర్వాత చాపరాయి నుంచి జైపూర్ జంక్షన్ వరకు రోడ్డు కిరువైపులానున్న చెట్టు నీడలో వనభోజనాలు చేస్తూ కుటుంబ సమేతంగా

ప్రకృతి అందాలకు పులకరింత

ఆటపాటలతో సందడి చేస్తూ ఆనందంగా గడిపారు. చాపరాయి జైపూర్ జంక్షన్ కు మధ్యలో పంతల చింత జంగిడి వలస రైల్వే గేట్ సమీపంలో నున్న పొద్దుతిరుగుడు పూల తోటలు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. దీంతో, ఆ పూల తోటల వద్ద పర్యాటకులు ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు.

మరుగుదొడ్లులో వాడుక నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకుల సౌకర్యార్థం అధికారులు మరుగుదొడ్లు నిర్మించి వాడుక నీటి కొరకు మోటార్ బోరును నిర్మించారు. స్థానిక గ్రామస్తులు ఆ మోటర్ నుంచి నీటిని ఉపయోగించుకుంటూ ఉండటంతో మరుగుదొడ్లకు సరిపడే వాడుక నీరు సప్లై కావడం లేదు. దీంతో పర్యాటకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అధికారులు చాపరాయి గేడ్డ వద్ద మోటార్‌ను ఏర్పాటు చేసి గెడ్డ నీటిని ప్రత్యామ్నాయంగా మరుగుదొడ్లుకు తరలిస్తున్నారు. తక్షణమే సంబంధిత ఐటిడిఏ ఉన్నతాధికారులు స్పందించి చాపరాయి జలపాతంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా మరిన్ని సౌకర్యాలు కల్పిస్తూ, మరుగుదొడ్లకు వాడుక నీటి సౌకర్యంకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

గంటల తరబడి ట్రాఫిక్ జామ్

అనంతగిరి:ప్రముఖ పర్యటక కేంద్రాలలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. అనంతగిరి, అరకు ఘాట్ రోడులో క్యూలైన్లో గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకు పోయాయి. కార్తీక మాసం ముగిస్తుండటంతో వేలాది మంది పర్యాటకులు అనంతగిరి బొర్రా గుహలతో పాటు కటికి, తాడిగుడ, చిట్టంపాడు వంటి జలపాతాలు సందర్శించారు. కుటుంబ సమేతంగా స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతూ సెల్ఫీలు దిగుతూ గడిపారు.కాఫీ ప్లాంటేషన్, డముకు, సుంకరమెట్ట యూ పాయింట్‌లను పర్యాటకులు సందర్శించారు. రహదారిపై వాహనాలు నిలిచి పోయాయి. సుంకరమెటలో రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారస్తులు విక్రయించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

అనంతగిరిలో నిలిచిన వాహనాలు

మన్యంలో జంట హత్యల కలకలం

- వివాహేతర సంబంధమే కారణం
- మహిళను, ఆమె ప్రియుడిని మట్టుబెట్టిన భర్త
- అనాథలుగా మిగిలిన ముగ్గురు చిన్నారులు

మృతులు శ్రీకాంత్, ప్రియాంక

ప్రజాశక్తి-చింతూరు : మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగిన జంట హత్యలు కలకలం రేపాయి. దీనికి సంబంధించిన వివరాలివి. మండల కేంద్రం లోని ఎర్రంపేట గ్రామానికి చెందిన ఉన్నం శ్రీకాంత్(38), ఇదే గ్రామానికి చెందిన వివాహిత మద్ది ప్రియాంక (30)ల మధ్య వివాహేతర సంబంధం ఉంది. శ్రీకాంత్, ప్రియాంక అర్ధరాత్రి సమయంలో ఒక ఇంట్లో అతి సన్నిహితంగా ఉన్న సమయంలో ప్రియాంక భర్త దుర్గా ప్రసాద్ అలియాస్ పండు వారిపై దాడి చేసి రాడ్‌తో కొట్టి హత్యకు పాల్పడినట్లు పోలీస్ వర్గాలు తెలిపారు. ఈ దాడిలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, కొనఊపిరితో ఉన్న ప్రియాంకను సమాచారం అందుకుని సంఘటనాస్థలికి చేరిన చింతూరు సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావులు తమ సిబ్బంది. స్థానికుల సహకారంతో చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడింది.

చింతూరు మన్యంలో జరిగిన జంట హత్యలకు వివాహేతర సంబంధమే కారణమని స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. చింతూరులో జరిగిన జంట హత్యల విషయం తెలుసుకున్న రంపచోడవరం ఒఎస్‌డి చింతూరు అదనపు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి హత్యకు గురైన శ్రీకాంత్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు ప్రియాంక ఇంటికి వెళ్ళి ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఒఎస్‌డి సూచనల మేరకు ఈ కేసును దర్యాప్తు చేయనున్నట్లు చింతూరు సిఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ జంట హత్యలతో రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. ప్రియాంకకు ఇద్దరు కుమార్తెలు రాహిత్య,తన్విత ఉన్నారు.

గృహ పన్నులు ఇక ఆన్‌లైన్‌లో చెల్లింపులు

-ప్రజాశక్తితో డిజిపిఒ తమ్మర్ల కొండలరావు

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలో గృహ పన్నులు వసూలుకు ఇకనుంచి ఆన్లైన్ విధానాన్ని ప్రవేశ పెడుతున్నట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమ్మర్ల కొండలరావు వెల్లడించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాల పై తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే.

ఆన్‌లైన్ విధానంలో చెల్లింపులు ఎలా?

గృహ పన్నుల వసూలుకు నగదు చెల్లింపులు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్ ఆదేశాల మేరకు గృహ పన్నుల వసూలుపై అన్ని పంచాయతీలకు ఇప్పటికే ఆన్లైన్ ద్వారా చెల్లింపులు జరపాలని సర్క్యులర్ జారీ చేసాం.

ఫోన్ పే సౌలభ్యం ఉందా

గృహ యజమానులు ఇకనుంచి నగదు రూపేణా కాకుండా ఆన్లైన్ ద్వారా పంచాయితీలకు పన్ను చెల్లించాలి. త్వరలోనే గృహ పన్ను చెల్లింపునకు ఫోన్ పే సౌలభ్యం కూడా కల్పించబడుతుంది.

జిల్లాలో పన్నుల డిమాండ్ ఎంత?

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, రంపచోడవరం డివిజన్లోని 430 పంచాయతీల పరిధిలో 2 లక్షల 32 వేల, 446 గృహాల నుంచి పన్నుల వసూలు జరుగుతుంది. కొత్తగా 8 వేల 726 గృహాలు చేర్చాము. గతంలో జిల్లాలో ఏడు కోట్ల 42 లక్షలు పన్ను డిమాండ్ కాగా ప్రస్తుతం 9 కోట్ల 86 లక్షలకు పన్ను డిమాండ్ పెరిగింది.

సాలిడ్ లిక్విడ్ రీసోర్స్ మేనేజ్మెంట్

జిల్లాలోని నాలుగు పంచాయతీల్లో సాలిడ్ లిక్విడ్ రీసోర్స్ మేనేజ్మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ శ్రీనివాసన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జిల్లాలోని రంపచోడవరం, మారేడుమిల్లి, పాడేరు పెద్దలకు పంచాయతీల్లో చేపట్టాం. సేకరించిన చెత్త విభజించి, రీ ప్రొడక్షన్ ద్వారా ఎరువు తయారీ వంటి ప్రక్రియ ద్వారా పారిశుద్ధ్యం మెరుగుతో పాటు ఆదాయ వనరు రూపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

ప్రశాంతంగా సెకెండ్ లెవెల్ పరీక్ష

చింతూరులో 47 మంది, రంపచోడవరంలో 151 మంది హాజరు

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -రంపచోడవరం : గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఏజెన్సీలోని గిరిజన యువతీ యువకులకు సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలకు సంబంధించిన శిక్షణకు అర్హుల ఎంపికకు సెకండ్ లెవెల్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. .ఆదివారం స్థానిక గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే ఆదేశాల మేరకు నిర్వహించిన మొదటి లెవెల్ పరీక్షకు 449 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 422 మంది హాజరయ్యారని, వీరిలో 150 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు ఆదివారం నిర్వహించిన రెండవ లెవెల్ పరీక్షకు రంపచోడవరం డివిజన్‌లో 150 మంది, చింతూరు డివిజన్‌లో 51 మంది పరీక్ష రాశారన్నారు.కార్యక్రమంలో గురుకుల మహిళ కళాశాల ప్రిన్సిపాల్ జి, ప్రసున్న, హెచ్‌ఎం కెఆర్‌పి కుమార్, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

చింతూరు :ఉచితంగా సివిల్ సర్వీస్, గ్రూప్స్ పరీక్షల శిక్షణకు అభ్యర్థుల ఎంపికకు చింతూరు ఏపీటీడబ్ల్యూ ఆర్. స్కూల్ (బాయ్స్)లో నిర్వహించిన రెండవ దశ స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొదటి దశలో 153 మందికి 51 మంది అభ్యర్థులు రెండవదశ పరీక్షకు క్వాలిఫై కాగా, ఆదివారం పరీక్షకు 47 మంది హాజరయ్యారు. ఐటిడిఎ పిఒకావూరి చైతన్య,ఆదేశాల మేరకు ఎంఇఒ జి. వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. పరీక్ష ఫలితాలను ఈనెల 5న చింతూరు ఐటిడిఎ కార్యాలయంలోని నోటీస్ బోర్డ్‌లో వెల్లడిస్తామని, ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 8,9 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించి శిక్షణకు అర్హులను ఎంపికచేస్తామన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ సిఎంఒ పి. సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

దీక్షలను విరమింపజేస్తున్న నాయకులు

సిహెచ్‌డబ్ల్యుల దీక్షలు తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి-పాడేరు: తమను ఆశ వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గత నవంబర్24 నుంచి ఐటీడీఏ ఎదుట సిహెచ్ డబ్ల్యు లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆదివారం తాత్కాలికంగా విరమించారు. తమను ఆశ కార్యకర్తలుగా గుర్తిస్తూ ఆశలతో సమానంగా జీతాలు, యూనిఫామ్, మెడికల్ కిట్, మందులు వంటి సౌకర్యాలు కల్పించాలని. గత పది రోజులుగా ఐటిడిఏ ఎదురుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. వివిధ సంఘాలు సిహెచ్డబ్ల్యుల ఆందోళనకు మద్దతునిచ్చాయి. తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సిఐటియు జిల్లా కోశాధికారి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి నాగరాజు పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారులు కనీసం సమస్య పరిష్కారానికి మార్గం చూపలేదని మండిపడ్డారు. పని చేయించుకునే ముందు ఇచ్చే జీతాల్లో వ్యత్యాసం కనీసం అధికారులకు పట్టడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే డిసెంబర్ 8న ఐటిడిఏ ముట్టడికి ఏజెన్సీలోని 700మంది సిహెచ్ డబ్ల్యు లు అందరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సుందర్ రావు మాట్లాడుతూ, అధికారులు ఈ 4 రోజుల్లో సమస్య పరిష్కారం దిశగా ఆలోచించకపోతే కచ్చితంగా ఎనిమిదో తారీకున ఐటీడీఏ ముట్టడించి తీవ్ర ఆందోళన ఉధతం చేస్తామని ఆయన అధికారులకు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్ పడాల్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు మంగమ్మ, కమ్యూనిటి హెల్త్ వర్కర్స్ పార్వతమ్మ, మోదకొండమ్మ, శేషు, లక్మి పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

ప్రజాశకి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలో వెలుగు సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లకు ఈనెల 4 నుండి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మండల ఎంపీడీవో కె కిరణ్ కుమార్ ఆదివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీ వరకు దశల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటరిలు శిక్షణ తరగతుల్లో అవగాహన పొందాలని సూచించారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామంలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యం లో ఆదివారం కందాల నాగరాజు సారథ్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్ఐ విభూషణరావు మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. మెడికవర్ హాస్పటల్ బృందం 250 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ,కందాల నాగరాజు ఆద్వర్యంలో వైద్యులను ఘనంగా సత్కరించారు. గ్రామీణా ప్రాంతంలో వైద్యశిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఎస్ఐ విభూషణరావు అభినం దించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు అనిల్ వర్మ, యువకులు ప్రసన్నకుమార్, ఆనంద్, జగదీష్ పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

మట్టి రహదారి ఏర్పాటు చేసుకున్న రాజ్ క్యాంప్ గ్రామస్తులు

పటిష్టం చేసి సౌకర్యాలు కల్పించాలని గిరిజనుల వినతి

ప్రజాశక్తి -మోతుగూడెం : సమాజానికి దూరంగా విసిరేసినట్టు ఉండే చింతూరు మండలం, మోతుగూడెం పంచాయతీ రాజ్ గ్రామస్తులు స్వచ్ఛందంగా రోడ్డును నిర్మించుకున్నారు. మోతుగూడెం గ్రామానికి 16 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ గ్రామంలో పది ఇళ్లు, 40మంది జనాభా ఉన్నారు. రాజ్ గ్రామానికి వెళ్లాలంటే, ఫార్బయ్ డ్యాం మీదుగా అడవి ప్రాంతంలో ఉంటున్న కనీసంమూడు కిలోమీటర్లు కాలినడకన అడవి ప్రాంతంలో కొండ ఎక్కి వెళ్ళాలి. రహదారి సౌకర్యం లేకపోవడంతో మంచినీటి, కరెంట్ సదుపాయాలు ఉండవు.. ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోయినా కనీసం మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి, మోతుగూడెం హాస్పిటల్‌కు రావాలి, రోగులను డోలిలో మోసుకెళ్లాల్సిందే. .లేదా నాటు మందులే గతి. రోజూ రాజ్ గ్రామానికి చెందిన ఎనిమిది మంది పిల్లలు ఫోర్బయ్ గ్రామంలోని పాఠశాలకు కాలినడకన నడుచుకుంటూ వెళ్లి రావాల్సిందే. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. దీంతో గ్రామస్తులంతా స్వచ్ఛందంగా శ్రమదానంతో గ్రామస్తులంతా ఒక్కటై రోడ్డు వేసుకున్నారు. మార్గమధ్యలో ఉన్న రాళ్లను తొలగించి. వాహనాలు వెళ్లేలా మట్టి రోడ్‌ను వేసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, తాము వేసుకున్న మట్టిరోడ్డును పటిష్టం చేయాలని, అలాగే తాగునీరు, విద్యుత్, ఇతర సౌకార్యాలను కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణంలో రాళ్లు తొలగిస్తున్న గిరిజన యువకులు

సొంతంగా మట్టి రోడ్డు వేసుకున్న రాజ్ క్యాంపు గ్రామస్తులు

మధుగురు గ్రామానికి బిటి రోడ్డు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని కల్లేరు పంచాయతీ మధుగురు గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సిసం సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సురేష్ ఆధ్వర్యంలో పార్టీ మండలకమిటీ బృందం మధుగురు గ్రామాన్ని సందర్శించి, గ్రామస్తులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారి మొత్తం మెటల్ రాళ్లతో అస్తవ్యస్తంగా ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రహదారి మధ్యలో కాలువలు, వాగులపై మధ్యలో ఉన్న వంతెనలు పూర్తిగా ధ్వంసమై, రంధ్రాలు ఏర్పడ్డాయని విన్నవించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు శిథిలమైన రోడ్డు, పాడైన కల్వర్టులను సిపిఎం బృందం పరిశీలించింది.

ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల రోడ్ల సమస్య పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. సిపిఎం ప్రజాప్రతినిధులు రహదారులు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టినా నిధుల లేమితో పనులు ముందుకు సాగలేదన్నారు. గిరిజన సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లింపు ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి అవరోధంగా మారిందన్నారు. మదుగూరు గ్రామానికి కల్లేరు ప్రధాన రహదారి నుంచి బిటి రోడ్ నిర్మాణం చేపట్టాలని, గ్రామంలో మంచినీటి బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు వల్ల పంటల పూర్తిగా ఎండిపోయి రైతాంగం నష్టం జరిగిందని, సీలేరు సోకిలేరు జీవనదులపై ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేయాలని కోరారుపెండింగ్ ఉన్న తునికాకు బోనస్ తక్షణమే విడుదల చేసి, గిరిజనులకు అందించాలని కోరారు. మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, పోడియం లక్ష్మణ్, దిలీప్, గ్రామస్తులు పండ నారాయణ, ఓగ్గిల సీతారామయ్య, పాండు గంగరాజు, కారం మనోజ్, కారం వినోద్, జోగారావు, మోట బ్రహ్మయ్య, కారం సుమన్, మోట కన్నారావు, మడకం బాబురావు పాల్గొన్నారు.

గ్రామస్తులతో కలిసి కూలిన కల్వర్టు, పాడైన రోడ్డున పరిశీలిస్తున్న సిపిఎం నేతల బృందం

అన్నదాతల్లో తుపాను కలవరం

ప్రజాశక్తి -కొయ్యూరు : మిచౌంగ్ తుఫాను ప్రభావం కొయ్యూరు మండలంలో స్పష్టంగా కనిపిస్తోంది. మండలంలో వాతావరణం పూర్తిగా మారిపోయి, బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. మండలంలో పలు చోట్ల వరిచేలు పండిపోవడంతో రైతులు కోతలు కోయించారు. అయితే తుఫాను ప్రభావంతో రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తమయ్యారు. పొలాల్లో కోసిన వరి పనలు పూర్తిగా తడి ఆరకుండానే ఆదరబాదరగా సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలు వేస్తున్నారు.

ఆదరాబాదరాగా ఎత్తిపెడుతున్న కోసిన వరిచేను

కబడ్డీ పోటీల్లో డిఎవి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -సీలేరు: తెలంగాణ కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్వహించిన క్లస్టర్ స్థాయి డిఎవి స్పోర్ట్స్ మీట్ కబడ్డీ పోటీల్లో సీలేరు డిఎవి పాఠశాల విద్యార్థులు అండర్ 17 విభాగంలో రన్నర్స్‌గా నిలిచారని పాఠశాల హెచ్‌ఎం ఓం నమశ్శివాయ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ ఈ పోటీలకు తమ పాఠశాల నుంచి పదవ తరగతి విద్యార్థులు కె..హేమంత్ ఎస్.కె .ఆషిక్, కె. దీక్షిత్, డి. జీవన్, ఏనిమిదవ తరగతి విద్యార్థి డి. జీవన్స్ 7 తరగతి విద్యార్థి ఎస్.కె .ఖాదర్ భాషా పాల్గొని సత్తా చాటారని తెలిపారు. క్రీడాకారులకు పాల్వంచ డిఎవి పాఠశాల ప్రిన్సిపాల్ రామారావు. మోతుగూడెం ప్రిన్సిపాల్ రఘురాం బహుమతులు అందజేశారు. విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన పిఇటి కమలాకర్‌ను వారు ప్రశంసించారు.

బహుమతులు అందుకున్న సీలేరు డిఎవి విద్యార్థులు

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కరువు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కుసర్లపూడి గ్రామంలో జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కానరాలేదు. కుసర్లపూడిలో 40 మందికి జగనన్న కాలనీ మంజూరైంది. వీరిలో 20 ఇళ్లు నిర్మాణం పూర్తయింది. 15 మంది శ్లాబ్ వరకూ నిర్మాణం చేపట్టారు. మరో ఐదుగురు పునాది దశ వరకూ నిర్మించారు. కాలనీకి రహదారి నిర్మించక పోవడంతో ఇసుక, రాయి, సిమెంట్, తరలింపునకు అదనంగా రవాణా ఖర్చు అవుతుందని లబ్ధిదారులు వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ మద్దు అప్పలనాయుడు మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఓ, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రహదారి వేయుటకు నిధులు లేవని చెప్పడం గమనార్హం. అధికార పార్టీలో ఉండి రహదారికి కల్పించలేకపోవడం సిగ్గు చేటని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. జగనన్న కాలనీలో ముందుగా లేఅవుట్ వేసి రహదారి నిర్మించాలి. ఇప్పటికీ రహదారి, పూర్తిస్థాయి కరెంట్ పోల్స్ వేయలేదు. వాటర్ ట్యాంక్‌కు పునాది వేశారు. ఆ స్థలం జిరాయితీ భూమిలో ఉండటంతో ఆ పనిని నిలిపివేసి బంజరు ల్యాండ్‌లోనే ట్యాంక్ నిర్మాణం ప్రారంభించారు.

'గ్రామ పంచాయతీలు నిర్వీర్యం'

ప్రజాశక్తి-రావికమతం:గ్రామ పంచాయతీలను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని నోడవరం నియోజకవర్గ సర్పంచుల సంఘం కన్వీనర్ గంజి మోడినాయుడు తెలిపారు. స్థానిక లక్ష్మీ కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మోడినాయుడు మాట్లాడుతూ, సర్పంచ్‌లకు భారత రాజ్యాంగం ప్రకారం వున్న అధికారాలు, విధులు, నిధులు లేకుండా ప్రభుత్వం చేసిందని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం సచివాలయం వ్యవస్థ కొత్తగా సృష్టించి సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14,15వ ఆర్థిక సంఘం నిధులు సొంత ఖాతాలకు మళ్ళించి గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీటి మెయింటెనెన్స్ లేకుండా చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్‌కు పట్టిన గతే రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డికి పడుతుందని ఆయన ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు ఎరుకునాయుడు, సర్పంచ్‌లు బొడ్డేడ రామునాయుడు, మడగల పాల్గొన్నా, చంద్ర పాల్గొన్నారు.

వర్షాభావంతో ఎండుతున్న చెరుకు

ప్రజాశక్తి-రోలుగుంట:ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరకు పంట ఎండుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని ఈ ఏడాది వర్షాలు ఆశించినంత పడక పోవడంతో ఈ ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట చెరకు పక్వానికి రాకముందే ఎండిపోతుంది. దీంతో, పెట్టుబడి ఎక్కువ నష్ట పోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు సుమారు 30వేల రూపాయలు పెట్టుబడి అయిందని, మొక్క దశలోనే ఎండిపోవడంతో బెల్లం తయారు చేసినా రాదని, ఏమి చేయాలో తోచక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని శరభవరం గ్రామానికి చెందిన బొబ్బిలి రమణ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ గ్రామంలో గతంలో సుమారు 500 ఎకరాల్లో చెరకు వేసే వారమని, 40 మంది రైతులకు బెల్లం క్రషర్లు ఉండేవని రైతులు తెలిపారు. గత మూడు సంవత్సరాల నుండి బెల్లంకు గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో చెరకు సాగు తగ్గించామని, క్రషర్లు కూడా మూత పడ్డాయన్నారు.

మురుగు నీటి కాలువను శుభ్రం చేయరూ...

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో మురుగు నీటి కాలువలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక జగ్గన్న చావిడి ప్రాంతంలో కొంతవరకు శుభ్రం చేసి చెత్తను విడిచి పెడుతున్నారని రిటైర్డ్ ఉద్యోగి ఎ.త్రినాధ్ తెలిపారు. కాలువలు శుభ్ర పరచక పోవడంతో దుర్గంధంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రపరచక పోవడంతో ప్రజలకు అనారోగ్యం ఏర్పడి ఇక్కట్లకు గురవుతున్నారని ఆయన తెలిపారు. కాలువలోని మురుగునీటితో దోమలు విపరీతంగా పెరిగి పోయాయని ఆయన వాపోయారు.

పేరెంట్స్ కమిటీ ఛైర్పర్సన్ మృతి

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట జెడ్పీ పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్‌పర్సన్ వై.దానులక్ష్మి ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. కొండపాలెం గ్రామానికి చెందిన లక్ష్మి పాఠశాల ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి చెందింది. ఆమె మృతి పట్ల ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:మిచౌంగ్ తుఫాన్ ముంచుకొస్తోందని, రానున్న రెండు రోజులలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా తుపాను సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరాన్ని దాటవచ్చని, దాని ప్రభావంతో "మిచౌంగ్" తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ జిల్లా ప్రజలను, జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. రైతులు కల్లాలలో ఉన్న వరి పనలు సురక్షిత ప్రదేశాలకు తరలించాలని, మత్స్యకారులు గెడ్డలు, వాగులలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. గిరిజనులు గెడ్డలు వాగులు దాటి ప్రయాణించరాదని సూచించారు. తుపాను సమయంలో శిథిల కట్టడాలు, చెట్ల పరిసరాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలలో తల దాచుకోవాలని కోరారు. తుపాను ప్రభావంతో రహదారులకు, సమాచార వ్యవస్థకు, విద్యుత్ సరఫరాకు నష్టం సంభవించే అవకాశం ఉన్నందున, ప్రజలు ఆ మేరకు సంసిద్ధంగా ఉండాలన్నారు. వర్షాభావ పరిస్థితులలో లోతట్టు ప్రాంతాల ప్రజలను జలమయం అయ్యే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికార యంత్రాంగం స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ, రహదారులు భవనాల శాఖ, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది నష్టం జరిగితే, భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

బిఎన్ఆర్ పీపుల్స్ క్లినిక్ ప్రారంభం

బిఎన్ఆర్ పీపుల్స్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైఎల్.నర్సింగరావు

ప్రజాశక్తి-మధురవాడ : కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బిఎన్ఆర్ పీపుల్స్ క్లినిక్‌ను పినాకిల్ ఆసుపత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వైఎల్.నర్సింగరావు ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు గుండె జబ్బులపై డాక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. డాక్టర్ వైఎల్ నర్సింగరావు మాట్లాడుతూ, అందరికీ అందుబాటులో వైద్య సేవలను, రక్త పరీక్షలను బిఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు అందజేస్తున్నందుకు అభినందించారు. డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అన్వేష్‌బాబు, డాక్టర్ హారిక, డాక్టర్ విశ్వశాంతి, డాక్టర్ విశ్వాంత్ మాట్లాడుతూ, ఎంతో ఉన్నతమైన కార్యక్రమాన్ని చేపట్టినందుకు అభినందిస్తూ ప్రజలకు వివిధ తెలియజేసి ఈ సేవలను అందే విధంగా బిఎన్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషిలో తాము కూడా పాల్గొని సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మెటర్నిటీ ఆసుపత్రి ప్రతినిధి బి.ఎల్.నారాయణ, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కామేశ్వరరావు, బిఎన్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ భాగ్యలక్ష్మి, ట్రస్ట్ ప్రతినిధి ఈశ్వరమ్మ, కృష్ణారావు, బుజ్జి, రామారావు, వెంకటరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. క్లినిక్ ప్రతిరోజూ సోమవారం నుంచి శనివారం వరకు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఓటర్ల నమోదు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - రావికమతం:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక నమోదును మండల ప్రత్యేక అధికారి బి.రవికిరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఈ అవకాశాన్ని అర్హులైన ఓటర్లు ఉపయోగించుకోవాలని కోరారు. అర్హులైన వారికి ఓటు హక్కు ఉండాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణ, తొలగింపులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు ఈ శిబిరంలో తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహేశ్వరరావు, డిప్యూటీ తహసిల్దార్ మురళీధర్, వీఆర్వో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల:ఓటర్ల జాబితా చేర్పులు, సవరణలు, తొలగింపులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిఆర్‌ఓ దయానిధి సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పలు కేంద్రాల వద్ద బిఎల్‌వోలు కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు.

పుస్తకాలు చదవడంతో విజ్ఞానం

ప్రజాశక్తి-గొలుగొండ:విద్యార్థులు పుస్తకాలు చదవడంతో విజ్ఞానాన్ని పెంచుకోవచ్చునని గ్రంథాలయాధికారి ఎస్.రాజబాబు సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థుల కోసం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. విద్యార్థులు పుస్తకాలతో పాటు రోజు దినపత్రికలను చదవాలన్నారు. దీంతో, లోకజ్ఞానం పెరుగుతుందన్నారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామంలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యం లో ఆదివారం కందాల నాగరాజు సారధ్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్ఐ విభూషణరావు మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. మెడికవర్ హాస్పటల్ బృందం 250 మందికి బీపి, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ,కందాల నాగరాజు ఆద్వర్యంలో వైద్యులను ఘనంగా సత్కరించారు. గ్రామీణా ప్రాంతంలో వైద్యశిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఎస్ఐ విభూషణరావు అభినం దించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు అనిల్ వర్మ, యువకులు ప్రసన్నకుమార్, ఆనంద్, జగదీష్, శ్రీను, సత్యం, గోవింద్, శివ, సింహచలం పాల్గొన్నారు.

ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు ఏదీ?

ప్రజాశక్తి-చీడికాడ:రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె)లో ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడతున్నారు. మండల కేంద్రంలో పలు గ్రామాలలో వరి కోతలు కోసి నూర్పు చేసి పండించిన ధాన్యాన్ని నిలవ చేయలేక పోవడంతో రైతులు దళారుల బారిన పడి తీవ్రం నష్టపోతున్నారు. గత ఏడాది రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ప్రభుత్వం ఈ ఏడాది నేటికీ కొనుగోలు చేయలేదు. తుఫాను సూచనలు కనిపిస్తుండటంతో రైతులు కొద్దిపాటి పండించిన పంటను విక్రయించాలనే తాపత్రయంతో ఉన్నారు. ప్రభుత్వం నేటికీ ప్రారంభించక పోవడంతో రైతులు దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులకు సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటిలో రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అంద లేదని రైతులు వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారుల స్పందించి రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

సిమెంట్ బల్లల ఏర్పాటు

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చయ్యపేట మండలం పి.భీమవరం రోడ్డు బంగారుమెట్టలో కొత్తగా నిర్మించిన భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు, సందర్శకులు కూర్చోవడానికి సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. బంగారుమెట్ట కు చెందిన దేవాంగుల సంఘం సహకారంతో రెండు సిమెంట్ బల్లలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన దాసు, కాళ్ల కోటేశ్వరరావు, ఉజ్జి చల్లారావు, బూడిద అప్పారావు అలంకి ప్రకాష్, చింతల వరహాలు పాల్గొన్నారు.

5న బహిరంగసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:మండంలోని వడ్డాదిలో ఈనెల 5న జరిగే సామాజిక సాధికార బస్ యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని పి.భీమవరం సర్పంచ్ పి.నపోలు రామునాయుడు కోరారు. ఆదివారం గ్రామ సచివాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగుర వేయడంతో ఆ పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. నక్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడేటి శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ యూనియన్ ప్రెసిడెంట్ నానాజీ, డాక్టర్ రఘు, పార్టీ నాయకులు నీలి అశోక్, మొల్లేటి చిన్ని, గంగిశెట్టి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ:తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించారని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన స్వగృహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, రేవంత్ రెడ్డి హయాంలో పార్టీకి పట్టం కట్టి ప్రజలు ఆమోదం తెలిపారని శ్రీనివాస్ తెలిపారు. రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్ కుటుంబానికి సాయం అందజేస్తున్న దాతలు

అగ్ని బాధిత వాలంటీరు కుటుంబానికి అండ

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మండలంలోని సున్నంపాడు పంచాయతీ తూర్రురు గ్రామానికి చెందిన గ్రామ వాలంటీర్ పల్లాల సోమిరెడ్డి ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నికి అహుతైంది. నిరుపేద గిరిజన తెగకు చెందిన వాలంటీరు కుటుంబం ఈ ప్రమాదంతో నిరాశ్రయలయ్యారు.బాధిత కుటుంబాన్ని మారేడుమిల్లి కోఆప్షన్ సభ్యులు గురుకు ధర్మరాజు, ఎన్ఎన్‌హెచ్ఆర్ఎఫ్ అల్లూరి జిల్లా కార్యదర్శి ఆనంద్ ఇన్నా, మైనార్టీ సెల్ సభ్యులు జిలాని పండు, స్థానిక వార్డు సభ్యులు బోండ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో బియ్యం, వంటసామాగ్రి, రూ.ఐదువేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో తుర్రురు గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి మ్యానిఫెస్టోపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు గిడ్డి ఈశ్వరి, .వంపూరి గంగులయ్య ఆదేశాల మేరకు ఆయా పార్టీల మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు. మండల అధ్యక్షులు గూడెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి, ఆన్‌లైన్‌లో ఇంటింటా వివరాలను నమోదు చేసుకున్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని, మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందజేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమానికి ప్రజలు మద్దతు తెలుపుతూ 9261292612 నెంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమం లో కొయ్యురు జనసేన పార్టీ అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, మండల బూత్ కన్వీనర్ సాగిన,బుజ్జిబాబు ,రాజంద్రపాలెం కోకన్వీనర్ పిట్టా.సుధీర్ బాబు, కాకర కుమార్, టిడిపి మాజీ ఎంపిటిసి వై వరహ బాబు. మండల కార్యదర్శి కంచం వీరబాబు టిడిపి మాజీ ప్రెసిడెంట్. సీనియర్ కార్యకర్త బాచి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం పట్ల హర్షం

ప్రజాశక్తి - కొయ్యూరు: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల్లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల జిసిసి రాష్ట్ర మాజీ ఛైర్పర్సన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎంవివి. ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కొయ్యూరు మండల కేంద్రంలో తెలుగుదేశం, సేన పార్టీ నాయకులతో సంబరాలు జరుపుకున్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు ఆప్తుడైన రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ కాంగ్రెస్ ఘన విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ లో జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులు ఘనవిజయం సాధించి, వైసిపి మట్టికరిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అలరించిన నేవీ బ్యాండ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ : నేవీ డే ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక సాముద్రిక నావెల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఇండియన్ నేవీ సింఫోనిక్ బ్యాండ్ కన్సర్ట్ ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆయన సతీమణి హిమగౌరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమర్‌నాథ్ దంపతులకు తూర్పు నౌకాదళ అధిపతి, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఆయన సతీమణి, 'నవ' ఈస్టర్న్ రీజియన్ ప్రెసిడెంట్ సంధ్య పెంధార్కర్ ఘన స్వాగతం పలికారు. కమాండర్ మనోజ్ సభాష్టియన్, లెఫ్టినెంట్ కమాండర్ జె.పద్మనాభన్ నేతత్వంలో సాగిన వాద్య విన్యాసం ప్రేక్షకులను మైమరిపించింది. కళాకారుల వాద్య విన్యాసాలకు ప్రేక్షకులు హర్షధ్వానాలతో అభినందించారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్ వాద్య కళాకారులను సత్కరించారు.

బతికేదెలా..?

వెంకట నగరంలో వ్యర్థ రసాయనాల పైపులైన్
- హేచరీస్ కోసం మత్స్యకారుల జీవితాలు బలి
- సర్వత్రా వ్యతిరేకత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పాయకరావుపేట విలేకరి

'మేమంతా బతికే చోట డెక్కన్ కంపెనీ పైప్‌లైన్ వేశారు. ఇప్పుడక్కడ రొయ్యలు దొరకడంలేదు. మా జీవనోపాధి పోయింది. అక్కడెక్కడో కంపెనీలు పెట్టి, ఇక్కడ పైప్‌లైన్ వేయడమేటి ? వేట తప్ప రెండోపని చేతకాని మేమెలా బతకాలి ? ఎక్కడకు వెళ్లాలి ?' - ఇవీ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటనగరం పంచాయతీలోని వెంకటనగరం, రాజా నగరం మత్స్యకారుల నుంచి వినిపిస్తున్న పశ్నలు. రంగుల పరిశ్రమ (డెక్కన్ కంపెనీ) వస్తే తమ పిల్లలకు ఉద్యోగాలొస్తాయని చెబితే ఆశపడి, పెద్దలు చెప్పిన మాటకు తలూపి బతుకుదెరువు కోల్పాయామంటున్నారు అక్కడి మత్స్యకారులు.



పైపులైన్ వేయనున్న సముద్ర తీర ప్రాంతం

ఆ ప్రాంతంలో తెలిసో, తెలియకో డెక్కన్ కంపెనీ ఏర్పాటుకు అంగీకరించిన మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింది. సొంతూరుకు ఆనుకొనివున్న సముద్ర తీరంలో చేపల వేటలేక బతకడానికి వలసలు వెళ్లి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. విద్యార్హతలున్న యువతకు ఉద్యోగాలిస్తామన్న డెక్కన్ కంపెనీ మాట తప్పడంతో వివిధ రకాల పనులు చేసుకొని ఇక్కడి వారంతా బతుకుతున్నారు. ఈ నష్టం చాలదన్నట్లు వ్యర్థాలను విడిచిపెట్టడానికి మరో వైప్‌లైన్ నిర్మాణానికి స్థానికంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాకినాడ సెజ్ సమీపంలో హేచరీస్ యజమానులకు నష్టంలేకుండా ఆ జిల్లాలోని తొండంగి మండలం, పెరుమళ్లపురం ప్రాంతంలో పరిశ్రమల వ్యర్థ రసాయనాలను రెండు కిలోమీటర్ల దూరంలోని సముద్రంలో విడిచిపెట్టకుండా.. దాదాపు 20 కిలోమీటర్లకుపైగా ఉన్న పాయకరావుపేట మండలం వెంకటనగరం సముద్ర తీరంలో విడిచిపెట్టేందుకు పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టడంపై ఈ ప్రాంత మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వ్యర్థ రసాయనాలు వదిలిన ప్రదేశం నుంచి సముద్రం నీరు వినియోగిస్తే హేచరీస్ నడపలేమని యజమానులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో వ్యర్థాలు వెంకటనగరంలో విడిచిపెట్టడానికి అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే డెక్కన్ కంపెనీ విడిచిపెడుతున్న వ్యర్థ రసాయనాలతో సముద్రంలో చేపల ఉత్పత్తి తగ్గింది. కొత్తగా పెరుమళ్లపురం ప్రాంతంలోని పరిశ్రమల వ్యర్థాలు వెంకటనగరం సముద్ర తీరంలో విడిచిపెడితే వెంకటనగరం, రాజానగరం మత్స్యకారులకు రెండు పైప్‌లైన్ల మధ్య వేట సాగక వలసలు పోవాల్సిన దుస్థితి ఎదురుకానుంది.

మత్స్యశాఖ లెక్కల ప్రకారం వెంకటనగరంలో 96 బోట్లు, రాజానగరంలో 58 బోట్లు ఉన్నాయి. ఈ రెండు గ్రామాల్లో 4,500 మంది మత్స్యకార జనాభావుంది. వీరిలో 1540 మంది సముద్రంలో వేటాడి బతుకుతున్నారు. వెంకటనగరంలో వ్యర్థ రసాయనాలు విడిచిపెడితే తమ జీవనాధారం పోతుందని మత్స్యకారులు అంటున్నారు. అయితే రసాయనాలు విడిచిపెట్టడానికి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్న వెంకటనగరం పంచాయతీకి ఏ సమాచారమూ లేదు.

పంచాయతీ అనుమతి కూడా తీసుకోలేదని సర్పంచ్ వంకా వెంకటరమణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. అటవీశాఖ భూముల్లో ఆ శాఖ అనుమతుల్లేకుండా రహదారి పనులు చేపడుతున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. దీనికి ముందు బల్క్ డ్రగ్ పార్కును కాకినాడ సెజ్ పరిసర ప్రాంత ప్రజలు వ్యతిరేకించడంతో నక్కపల్లికి తరలించాలని ఈ ఏడాది సెప్టెంబరు 20న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. హేచరీస్ యజమానులకు నష్టంలేకుండా పైప్‌లైన్ నిర్మాణ పనుల కోసం వెంకటనగరం, కాకినాడ తారు రోడ్డు నుంచి సముద్రతీరం వరకు మట్టిరోడ్డు పనులు ఇటీవల ప్రారంభించారు. మత్స్యకారులు ఐక్యంగా ఆ పనులను అడ్డుకోవడంతో తాత్కాలికంగా నిలిపివేశారు

9న ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం 'వేవ్స్ 2023'ని ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కె.సమత తెలిపారు. ఆదివారం ఉదయం వర్సిటీ జిఎంఆర్ ఆలుమ్ని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ హాజరవుతారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 5 నుంచి ప్రధాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు. ఎయు అలుమ్ని అసోసియేషన్ వ్యవస్థాపక చైర్మన్ జిఎం.రావు అధ్యక్షత వహిస్తారన్నారు. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ఎయులోని స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను, ప్రయోగశాలలను సందర్శిస్తారన్నారు. అనంతరం ప్రత్యేక సావనీర్‌ను వేదికపై ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. దేశ, విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఎయు శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పనిచేస్తుందన్నారు. విశిష్ట స్థానాలలో ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఎయుతో అనుసంధానం చేయనుందన్నారు.

తోపుడు బండ్ల కార్మికులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కొటక్ స్కూల్ డౌన్‌లో తోపుడు బండ్లు ఉన్న ప్రాంతాన్ని హాకర్ జోన్‌గా ప్రకటించాలని విశాఖ తోపుడు బండ్లు సంఘం గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ 21వ వార్డు కొటక్ స్కూల్ రైల్వే గెస్ట్ హౌస్ ఫుట్‌పాత్‌పై 23 మంది తోపుడు బండ్లు కార్మికులు చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. జివిఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు నిత్యం వీరిపై దాడులు చేస్తున్నారన్నారు. స్మార్ట్ సిటీ పేరుతో నగరంలో తోపుడు బండ్లు లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జివిఎంసి అధికారులు ప్రయత్నించడం సరికాదని అన్నారు.

కార్పొరేటర్ చెప్పారని, ఎమ్మెల్యే చెప్పారని చిన్న వాల్తేరు ప్రాంతంలోని అధికార పార్టీ నాయకులు కొత్తగా తోపుడుబండ్లను పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న తోపుడు బండ్ల కార్మికులు ఈ కొత్త బండ్లు పెట్టడం వల్ల మరింతగా ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. 2014 స్ట్రీట్ వండర్స్ చట్టాన్ని అనుసరించి అధికారులు మెలగాలన్నారు. లేనిపక్షంలో నగరంలోని తోపుడు బండ్ల కార్మికులను కదిలించి జివిఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొటక్ స్కూల్ తోపుడు బండ్ల కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అప్పారావు, కె.రాజు,

ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న వైసిపి నేతలు

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని గదబ పాలెం పంచాయతీ కొత్తూరు గ్రామంలో ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. మళ్లీ జగన్‌ను సిఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి. అప్పారావు. వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సూరిబాబు, స్థానిక సర్పంచ్ ఉల్లి నర్సమ్మ, మాజీ ఎంపిటిసి నేగుల లక్ష్మణా రావు, నాయకులు ఉల్లి రాము, సచివాలయం కన్వీనర్ నీలాపు లక్ష్మి వాలంటీరు ఉల్లి కృష్ణమూర్తి, గృహ సారథులు పాడి దేముడు, ఉల్లి నూకరత్నం, గ్రామ యువకులు ఉల్లి లక్ష్మయ్య, ఉల్లి ప్రసాద్, ఉల్లి చిన్న ప్రసాదు, ఉల్లి గోవింద, సుర్ల నాగరాజు, సూర్ల నుకాలమ్మ, సుర్ల రవణమ్మ పాల్గొన్నారు.

గంభీర్‌తో ఎంపీ మాధవి

గౌతమ్ గంభీర్‌ను కలిసిన ఎంపీ మాధవి

ప్రజాశక్తి- కొయ్యూరు :టీమిండియా మాజీ క్రికెటర్, సహచర పార్లమెంట్ సభ్యులు గౌతమ్ గంభీర్‌ను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులోని వీఐపీ లాంజ్‌లో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు.

గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి -కొయ్యూరు: గిరిజన జిల్లాగా ఏర్పడిన అల్లూరిలో గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి లభించడం లేదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కొయ్యూరులో మీడియాతో మాట్లాడారు. ఇటీవల మహిళా శిశు సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో గిరిజనులకు అవకాశాలు లేక పోవడం దారుణమన్నారు. గిరిజన ప్రాంతంలో కేవలం గిరిజన అభ్యర్థులతోనే పోస్టులు భర్తీ చేయాలన్నారు. లేదంటే రానున్న రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ఓట్లను అక్రమంగా వాలంటీర్ల సాయంతో తొలగించడంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రధాన సూత్రధారి అని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. ఆదివారం విశాఖ విమానాశ్రయంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిసి పలు వివరాలతో కూడిన వినతిపత్రాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైతే వైసిపికి వ్యతిరేకంగా ఉన్నారో వారిని వాలంటీర్ల సాయంతో గుర్తించి వారి ఓట్లను తొలగిస్తున్నారని తెలిపారు.